'సజ్జల'ను కలసిన 'తెన్నేటి'



వైఎస్సార్ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ శుక్రవారం తాడేపల్లిలో కలిశారు. రాబోయే కాలంలో వైఎస్సార్ సీపీని విజయపథం వైపు నడిపించేందుకు కృషి చేయాలని సజ్జల సూచించారని కిషోర్ తెలిపారు.

క్లుప్తంగా

చవితి మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో చవితి ఏర్పాట్లుపై కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీకృష్ణ, శుక్రవారం వివిధ శాఖల అధికారులతో చర్చించారు. చవితి మహోత్సవాల్లో భాగంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గభవాని అధ్యక్షతన ఈ సమీక్ష నిర్వహించారు. వాహనాలు నిలిపేందుకు వినాయక సేవ సదన్ భవనం సమీపంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయం భక్తుల కోసం ఏర్పాటు చేసే క్యూను పటిష్టంగా నిర్మిస్తున్నామన్నారు. అలాగే అన్నదానం సత్రం వద్ద భక్తులకు చేసే ఏర్పాట్లపై చర్చించారు. చవితి మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై హరికోటిశాస్త్రి, ఆర్ఐ వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.

క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించిన యూత్ ఫెస్ట్ క్విజ్ పోటీల్లో చక్కని ప్రతిభ కనబర్చారు. అమలాపురంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలో ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బొక్కా యోగ శ్రీవల్లి, వాసంశెట్టి సంధ్య ప్రథమ స్థానం సాధించారు. వారిద్దరికి రూ.ఐదు వేలు, ప్రశంసా పత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో ఈనెల 26న విజయవాడలో జరిగే క్విజ్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీ



ఆలమూరు ఏటిగట్టు రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు: ఆలమూరు నుంచి కోటిపల్లి వెళ్లే ఏటిగట్టు రోడ్డులో శుక్రవారం వాహనాల తనిఖీ జరిగింది. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అలాగే జొన్నాడ, కొత్తూరు సెంటర్‌లలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిగే ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆలమూరు ఎస్సై జి.నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

మామిడికుదురు: పాత పింఛన్ రద్దు సాధన కోసం ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద జరిగింది. డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఈ మహాధర్నా నిర్వహిస్తున్నామని టీచర్స్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో–57 ప్రకారం పాత పింఛన్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పోలీసులకు పాత పింఛన్ పునరుద్ధరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. డీఎస్సీ–2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టే ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని టీచర్స్ పిలుపునిచ్చారు.

ఆస్పత్రికి వెళితే ఇంటిలో బంగారం చోరీ

అంబాజీపేట: వైద్యం కోసం ఆస్పత్రికి వెళితే ఇంటిలోని బంగారం, నగదు దొంగలు అపహరించుకుపోయారు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగలకుర్రు మలుపు శివారు రావులమ్మ పానాటంకు చెందిన మాదే ప్రసాద్ భార్య బేబీకి అనారోగ్యం కారణంగా ఈ నెల 21న అమలాపురం ఆస్పత్రికి తన కుమార్తె అనిత తీసుకువెళ్లింది. బేబీని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో ఉంచి శుక్రవారం ఉదయం అనిత ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించిందన్నారు. ఇంటి లోపల ఉంచిన 38 గ్రాముల బంగారం, నగదు చోరీకి గురైనట్లు గుర్తించిందన్నారు. అనిత ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై కె.చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రామరాజులంకలో వరదలో మునిగిన కొబ్బరి, **వరి పొలాలు**



ముంపునకు గురైన అప్పనపల్లి కాజ్‌వే



పాశర్లపూడిబాడవలో ముంపునకు **గురైన కనకదుర్గ ఆలయం**



ఊడిమూడి వద్ద వరదనీట **మునిగిన పశువుల పాకలు**



జి.పెదపూడిలో వరదనీట మునిగి కుళ్లిపోతున్న బొప్పాయి తోట

జలదిగ్బంధం

- లంక గ్రామాలను చుట్టుముట్టిన వరద
- మునిగిన కాజ్‌వేలు
- ప్రజలకు తప్పని అవస్థలు

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతితో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పనపల్లి కాజ్‌వే నీట మునిగింది. దీనిపై భారీగా వరద ప్రవహిస్తోంది. ఇక్కడ నాలుగడుగుల మేర వరద పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. ఆర్టీసీ సర్వీసును రద్దు చేశారు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువ నుంచి అప్పనపల్లి వెళ్లే రోడ్డు ముంపులో చిక్కుకుంది. దీంతో పాటు పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార కాలనీలను వరద చుట్టుముట్టింది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపుబారిన పడడంతో పశుగ్రాసాన్ని రైతులు ఇంజిన్ నావలపై సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంక గ్రామాల్లోని కూరగాయల తోటలు ముంపుబారిన పడ్డాయి.

కొనసాగుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో వరద ధాటికి రహదారులు నీట మునిగాయి. కె.ఏనుగుపల్లి రహదారిపై రెండు అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తోంది. అలాగే మానేపల్లి శివారు శివాలయంకకు వెళ్లే రహదారి నీట మునిగింది. దీంతో అక్కడ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్‌పై ప్రయాణించి ప్రజలు శివాలయలంకకు వెళ్తున్నారు. మొండెపులంక శివారు పుచ్చల్లంకకు వెళ్లే రహదారి నీట మునిగింది. వరదలతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర సరకులకు, తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పడవలు దాటి బయట గ్రామాలకు వచ్చి సరకులు తీసుకువెళ్తున్నారు. కొన్ని రకాల తోటలు కుళ్లిపోతున్నాయి. వరదలతో తీవ్రంగా నష్టపోయామని లంక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు వరద ఉధృతిలో పడవలపై ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. లంకల్లోని వ్యవసాయ ఉత్పత్తులు, పాల క్యాన్లను రైతులు పడవలపై బయటకు తీసుకువస్తున్నారు. అలాగే జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. లంకలన్నీ వరద నీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లపైకి తరలించారు. పశు గ్రాసానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉధృతంగా వరద

మలికిపురం: మండలంలోని రామరాజులంక, దిండి గ్రామాల్లో శుక్రవారం వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. కొబ్బరి తోటలు, వరి పొలాలను వరద ముంచెత్తింది. రైతులు కొబ్బరి కాయలను, వరి పొలాలలోని గడ్డి మేట్లను ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. వరద తీవ్రత వల్ల దిండి టూరిజం కేంద్రంలోని హౌస్ బోట్లకు సర్వీసులు నిలిపి వేసి పగడ్బందీగా లంగరు వేశారు. తహసీల్దార్ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్ఐ వేణు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ముదునూరి శ్రీనివాసరాజు, కాకర శ్రీనివాస్, వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అవసరాన్ని బట్టి గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా బోట్లు ఏర్పాటు చేస్తామని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు అన్నారు. కటికిరెడ్డి మహేశ్, పిండి సత్యనారాయణ తదితరులు టేకిశెట్టిపాలెం వద్ద వరద ఉధృతిని పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు.

లోతట్టు ప్రాంతాలను చుట్టుముట్టిన వరద

సఖినేటిపల్లి: మండలంలో అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల పరిధిల్లోని లోతట్టు ప్రాంతాలను, ప్రధాన రహదారులను, నివాస గృహాలను, కొబ్బరితోటలను వరద చుట్టుముట్టింది. దీంతో పై రెండు గ్రామాల మధ్య టేకిశెట్టిపాలెం సరిహద్దులో గోదావరిపాయపై ఇటీవల నిర్మించిన నూతన కాజ్‌వే ద్వారా రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గోదావరి పాయను ఆనుకుని అప్పనరామునిలంక సీసీఎఫ్ సొసైటీ భూముల్లోకి, టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీకి వరద నీరు పోటెత్తింది. సఖినేటిపల్లి లాకుపేటలోకి వరద చేరింది. ప్రధానంగా లాకుల వద్ద తలుపులు పూర్తిగా మూసుకోక పోవడంతో గోదావరి పాయ ద్వారా వరద పి.గన్నవరం ప్రధాన పంటకాలువలోకి చేరుతోంది. సఖినేటిపల్లి సరిహద్దులో ఇదే గోదావరి పాయపై గతంలో నిర్మించిన మరో కాజ్‌వే పై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా వరద తీవ్రతను బట్టి టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి ప్రజలకు అప్పనరామునిలంకలోని వివిధ గ్రూపులకు రాకపోకలపై తగిన చర్యలను సమీక్షిస్తామని అధికారులు తెలిపారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద ఉధృతిని అధికారులు పరిశీలించారు.

మధ్యలంక వాసుల తరలింపు

రాజోలు: గోదావరి వరదకు పోటెత్తడంతో రాజోలు మధ్యలంక, శివకోటిలంక నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శుక్రవారం నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, రాజోలు తహసీల్దార్ సీహెచ్ భాస్కరరావు ఆధ్వర్యంలో అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. రాజోలునున్న వారి బాడవ, కుంట, మేకలపాలెం, సోంపల్లి ఏటిగట్టు, తాటిపాక మఠం దిగువ పెదలంక, పొదలాడ ఏటిగట్టు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. రాజోలు కై లాస భూమి, కాటన్‌పార్కు, న్నున వారి బాడవలోకి వరద చేరింది. రాజోలు ఆంజనేయ స్వామి గుడి వద్ద రేవు వద్ద ఉన్న పార్కు పూర్తిగా వరదనీటితో మునిగిపోయింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివాసితులకు రక్షిత తాగునీరు 20 లీటర్ల టిన్‌లను అందజేశామని తహసీల్దార్ తెలిపారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: మండలంలోని గోదావరి వెంబడి ఉన్న బడుగువానిలంక, చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, ఆలమూరు గ్రామాలను శుక్రవారం వారు పరిశీలించారు. గోదావరి పెరుగుతున్నందున అనుక్షణం ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రావులపాలెం మండలం ఊబలంక పంచాయతీ శివారు తోకలంకకు వెళ్లేందుకు గత 15 రోజుల క్రితం ఏర్పాటు చేసిన తూరలతో ఏర్పాటు చేసిన కాజ్‌వే వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతాన్ని కూడా వారు పరిశీలించారు. అలాగే స్థానికులు తోకలంకకు రాకపోకలు సాగించేందుకు వీలుగా రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పడవలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలతో కలసి వరదలను ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన విధి విధానాలపై సమీక్షించారు.

కాజ్‌వేపై ఉధృతిగా ప్రవహిస్తున్న వరద నీరు

అయినవిల్లి: వరద ఉధృతికి మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. కాజ్‌వే మునగడంతో లంక గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంకకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పడవలపైనే నిత్యావసరాలు తెచ్చుకునేందుకు, పాల ఉత్పత్తులు తరలించేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వే దాటేందుకు అధికారులు నాలుగు నాటు పడవలను ఏర్పాటు చేశారు. లంక గ్రామాల్లో పండిన కూరగాయలు, పాల ఉత్పత్తులను పడవలపై తరలిస్తున్నారు. అలాగే వృద్ధగౌతమిపాయ(తొగరపాయ)లో వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. వృద్ధగౌతమి శ్మశానవాటిక పూర్తిగా వరదనీటిలో మునిగింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చిన వారు నానా అవస్థలు పడుతున్నారు.



దిండిలో వరద ధాటికి లంగరు వేసిన పర్యాటక శాఖ హౌస్, ఫాంటూన్ బోట్లు



చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే వద్ద పడవలపై వెళ్తున్న ప్రజలు



అప్పనరామునిలంక మెయిన్ రహదారిలో పోటెత్తిన వరద



సఖినేటిపల్లి లాకుల వద్ద పి.గన్నవరం ప్రధాన పంటకాలువలోకి చేరుతున్న వరద

వరద ప్రభావిత గ్రామాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి

అయినవిల్లి: మండలంలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి పెరగడంతో అధికారులు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని ఆయన పరిశీలించారు. వరద ఎక్కువగా ఉండటంతో ఆయన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ లంక గ్రామాల్లోని పరిస్థితిని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను పరిశీలించి గ్రామస్తులకు తక్షణ సాయం అందివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఎమర్జెన్సీ మెడికల్ సేవలందివ్వాలన్నారు. వరద బాధితులకు తక్షణ సాయంగా బియ్యం, పప్పులు నిత్యవసరాలు పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్, పల్లి ఈశ్వరరావు, గోడి ప్రసాద్, బొంతు శ్రీనివాసరావు, చల్లాబత్తుల శ్రీనివాస్, రమణాతి రాంబాబు ఉన్నారు.



ముక్తేశ్వరం–అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని సమీక్షిస్తున్న గన్నవరపు శ్రీనివాసరావు

కట్టుంగ సర్పంచ్ బ్రహ్మాజీరావు మృతి

కొత్తపేట: ఆత్రేయపురం మండలం కట్టుంగ సర్పంచ్ కరుటూరి బ్రహ్మాజీరావు (67) మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సుమారు 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ ఆ పార్టీకి అంకితభావంతో పని చేస్తున్నారు. విదేశాల్లో ఉన్న కుమారుడు, కుమార్తె శుక్రవారం స్వగ్రామం చేరుకోగా బ్రహ్మాజీరావు అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత బ్రహ్మాజీరావు పార్థివ దేహాన్ని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సందర్శించి, పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కరుటూరి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. అనంతరం జగ్గిరెడ్డి స్వయంగా బ్రహ్మాజీరావు పాడెను మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కరుటూరి మృతికి పలువురు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సంతాపం పాల్గొన్నారు.



బ్రహ్మాజీరావు (ఫైల్)



కట్టుంగలో బ్రహ్మాజీరావు పాడె మోస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్త అక్విడెక్టుపై మరమ్మతులకు రూ.49.35 లక్షలు

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టు రోడ్డుపై ఎక్స్‌టెన్షన్ జాయింట్ల మధ్య ఆధునాతన పద్ధతిలో షీట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర మరమ్మతులకు కలెక్టర్ రూ.49.35 లక్షలు మంజూరు చేసినట్టు ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్ చెప్పారు. కొత్త అక్విడెక్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్విడెక్టు రోడ్డుపై జాయింట్లు ధ్వంసమై గోతులు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ జాయింట్ల మధ్య అధునాతన పద్ధతిలో షీట్లు ఏర్పాటు చేస్తారు. అలాగే రోడ్డుకు మరమ్మతులు, ధ్వంసమైన ఫుట్‌పాత్ ఆధునీకరణ వంటి పనులు నిర్వహించనున్నట్టు ఆయన వివరించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ కె.వెంకటేశ్వరరావు, పి.గన్నవరం డీఈ భూపతిరాజు ప్రసాదరావు ఉన్నారు.



పి.గన్నవరం అక్విడెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

బాలుడి చికిత్సకు సీఐ సాయం

రాజోలు: ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా ఆపదలో ఉన్న వారికి సాయం అందించడం కూడా బాధ్యతగానే భావించారు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్. బ్లడ్ ట్యూమర్, ఫిట్స్‌తో బాధపడుతున్న ములికిపల్లి గ్రామానికి చెందిన 13 ఏళ్ల ఇంగువ లక్ష్మి వినయ్‌కుమార్‌కు రూ.10 వేలు అందజేశారు. వినయ్‌కుమార్ అమలాపురంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఐ ఆర్థికసాయాన్ని బాలుడి తల్లి ఇంగువ సంధ్యరాణికి అందజేశారు. సాయం అందించడమే కాకుండా భవిష్యత్‌లో తన వంతు సహకారం అందిస్తానని తల్లికి భరోసా ఇచ్చారు. బాలుడి చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందించిన సీఐను పలువురు అభినందించారు.



సంధ్యారాణికి సాయం అందిస్తున్న సీఐ

ఎస్టీఓగా నేడు బాధ్యతల స్వీకరణ

ముమ్మిడివరం: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ (ఎస్ఏ)గా పనిచేసిన కోలా కృష్ణ సబ్ ట్రెజరీ ఆఫీసర్ (ఎస్టీఓ)గా పదోన్నతి పొందారు. ముమ్మిడివరం కార్యాలయంలో సుమారు 6 సంవత్సరాలు పాటు ఎస్ఏగా విధులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన అమలాపురం ఎస్టీఓగా నియమితులయ్యారు. శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఎస్ఏ) స్టేట్ ప్రెసిడెంట్ పాము శ్రీనివాసరావు, వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

ఆలమూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించిన సీఎం చంద్రబాబు ప్రజలను దారుణంగా మోసగించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. మండలంలోని గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, పెంటపాటి శ్యామల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మితో కలసి మండల కన్వీనర్ తమ్మన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై పెనుభారం మోపారన్నారు. ఊరూరా, వీధివీధినా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకంలో కౌలుదారులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో విద్యార్థులు వీధిన పడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు కలిగిన మేలును ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పోల్చి చూస్తే ప్రజలకు ఎవరు మంచి చేశారో అర్థమవుతుందని వైఎస్సార్ సీపీ నేతలు వివరించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన బాబూ ష్యూరిటీ–మోసం గ్యారంటీకి విశేష స్పందన లభించింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏవిధంగా నిర్వీర్యం చేస్తుందన్న విషయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా వైఎస్సార్ సీపీ నేతలు గ్రామస్తులకు వివరించారు. పార్టీ నేతలు నామాల శ్రీనివాసు, నల్లి రాజు నాంద్ర నాగమోహన్‌రెడ్డి, కురుపూడి లోవ సత్యనారాయణ, మేడిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మిలేరులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా 'గుత్తుల'

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా గుత్తుల నాగబాబు నియమితులైనట్లు శుక్రవారం పార్టీ కార్యాలయం ఉత్తర్వులు అందాయి. తాను పార్టీకి ఎంతగానో సేవలందించినందుకుగాను పార్టీ పదవి వరించినట్లు నాగబాబు తెలిపారు. ఈ పదవి తనకు ఇచ్చినందుకు పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



గుత్తుల నాగబాబు

ఎంపీటీసీ రాజీనామా

మామిడికుదురు: పెదపట్నం గ్రామం నుంచి జనసేన తరపున ఎంపీటీసీ గెలిచిన కడలి పద్మావతి ఆశ వర్కర్‌గా ఎంపికయ్యారు. దీంతో ఆమె తన పదవికి ఈ నెల 21న రాజీనామా చేశారు. ఆ రాజీనామాను ఆమోదిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. తాను వైద్య ఆరోగ్య శాఖలో ఆశా కార్యకర్తగా ఎంపికయ్యానని, ఆశా కార్యకర్తగా విధులు నిర్వహించాలని నిర్ణయించుకున్నానని తెలపడంతో ఆమె రాజీనామాను ఆమోదించామన్నారు.

మెగా మార్ట్‌లో చోరీ

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న మెగా మార్ట్ షాపులో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు మార్ట్‌లోని రూ.25 వేల నగదును అపహరించారు. మార్ట్‌లోని కొన్ని వస్తువులను కూడా తస్కరించారు. క్లూస్ టీమ్ ఆ షాపునకు వచ్చి చోరీకి సంబంధించిన కొన్ని ఆధారాలను సేకరించింది. మార్ట్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.